# రోజూ ఉదయిస్తాడు సూర్యుడు

సావుకారు ముందుకు వచ్చి నుంచుని తలవంచి నమస్కరించాడు లారీడ్రైవర్ వెంకటేశ్వరరావు. చెప్పు అన్నట్టు తలూపాడు సావుకారు.

'కొత్త ఇంటిలో దిగుతున్నామండి— తమరొచ్చి... ఆశీర్వదించాలండీ' అని ఎంతో గౌరవంగా, వినయంగా, భక్తి ప్రపత్తులతో చెప్పాడు వెంకటేశ్వరరావు. ఆ నుంచోవటంలో, ఆ నమస్కారంలో, ఆ మాటల్లో కృతజ్ఞత, విధేయత వెల్లడించుకున్నట్టు చెప్పాడు. తన రెండు చేతుల్తో ఆహ్వానపత్రికను సావుకారు చేతుల్లో పెట్టాలన్నట్టు పట్టుకున్నాడు. సావుకారు ఆహ్వానపత్రికను అందుకుని తను కూర్చున్న పరుపుమీద పెట్టాడు.

వెంకటేశ్వరరావు అంటే సావుకారుకు చాలాఇష్టం. ఇరవైయ్యేళ్ల వయస్సులో వాడు తన దగ్గర చేరాడు. ఆరోజుల్లోనే సావుకారు కొత్త కొత్త వ్యాపారాలు మొదలుపెట్టాడు. వెంకటేశం ఆ ఊళ్లో పెద్ద ఫుట్‌బాల్ ఆటగాడు. ఎస్సెల్సీ నాలుగుసార్లూ ఫేలయినాడు. వాడికి చదువు అబ్బలేదు. వాడి తండ్రి సావుకారు దగ్గరకు తీసుకుని వచ్చి నీ పనుల్లో పెట్టుకుని వాడికి తిండి పెట్టుబాబు అని అడిగాడు. సావుకారుకు ఇప్పటికీ గుర్తు. ఏం 'పనిచేస్తావ్' అని వాడి పేరుకూడ

అడక్కముందు తండ్రి తొడ్కొని వచ్చాక ఆ ఇరవైయ్యేళ్ల కుర్రాడిని అడిగినప్పుడు 'మీరు ఏపని చేస్తే అది. ఏపనన్నా చేస్తాను' అన్నాడు. ఆ సమాధానం సావుకారుకు చాలా నచ్చింది. 'రోజుకు ఎన్నిగంటలు పనిచేస్తావ్' అని మరొక ప్రశ్న అడిగాడు సావుకారు. 'ఎంతసేపు చెయ్యమంటే అంతసేపు చేస్తాను' అన్నాడు. సావుకారు నవ్వాడు. 'ఇరవై నాలుగ్గంటలూ చేస్తావా?' అని అడిగాడు సావుకారు. 'ఆ... ఇరవైనాలుగ్గంటలూ చేస్తా' నన్నాడు ఆలోచించకుండా ఆ కుర్రాడు. 'ఆలోచించి చెప్పు — నేను ఏమడిగినానో తెలుసా?' అని మరోసారి సావుకారు తన ప్రశ్న సంగతి గుర్తుచేశాడు. అడిగిన ప్రశ్న తెలుసునన్నట్టు తలూపాడు. 'మరి నిద్ర వద్దా. నిద్రలేకుండ పనిచేస్తావా —' అన్నాడు సావుకారు. తిండొద్దా 'తినటానికి అరగంటేనా విడుపుకావాలి కదా — ఆలోచించి చెప్పు' అని నిగ్గదీశాడు ఆ రోజు సావుకారు. అవన్నీ పనికిందే వస్తాయన్నాడు. పనిచెయ్యాలంటే తిండీ నిద్ర కావాలి కదా అన్నాడు. ఆ సమాధానం చెప్పినప్పుడు సావుకారు బిగ్గరగా నవ్వాడు. ఆ నవ్వు పదినిమిషాలపాటు అట్లాగే నవ్వాడు. తర్వాత ఆ తండ్రిని పిలిచి 'నువ్వు వెళ్లిపో. ఆ అబ్బాయిని నా దగ్గరొదిలేయ్' అన్నాడు.

ఒక్క వెంకటేశమే కాదు. తన దగ్గర పనిచేస్తున్న దాదాపు మూడువందల మందిని అట్లాంటి ప్రశ్నలు వేసి పనుల్లోకి తీసుకుంటాడు. రెండు మూడేళ్లు వాళ్లు నలిగిన తర్వాత వాళ్లను ఎక్కడ ఏ పనుల్లో పెట్టాలో ఆ పనుల్లో పెట్టుకుంటాడు సావుకారు.

వెంకటేశం చేరిన రెండేళ్లకి లారీడ్రైవర్ అయినాడు. డ్యూటి ఏ అర్ధరాత్రి ఎక్కమన్నా సరేననే వాడు తప్ప రెండోమాటలేదు. ఈ పదమూడేళ్లలో — వాడి బండికి ఎప్పుడూ ఏ ఇబ్బందీ రాలేదు. పక్క రాష్ట్రం ఒరిస్సా, దగ్గర్లోనే మధ్యప్రదేశ్, బెంగాల్, బీహార్, ఉత్తర ప్రదేశ్, ఢిల్లీ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర — ఈ రాష్ట్రాలన్నీ తిరిగాడు. పోలీసులు చేతిలోగాని, ఇతర అధికార్ల చేతిలోగాని పడిన ఒక్క ఉదంతం కూడా లేదు.

వెంకటేశం నవ్వుముఖం చూస్తేచాలు — పెద్దపెద్దగొడవలు వచ్చినప్పుడు కూడా వాడిని వదిలేసేవారు. వాడు చెప్పిన మాట నమ్మేవారు. అట్లాంటి వెంకటేశంని ఇప్పుడు అంతా గత అయిదారేళ్లుగా వెంకటేశ్వరరావు అనటం కూడా సావుకారుకు ఇష్టంగానే ఉంది. వెంకటేశం పెద్దవాడు కాలేదా?

వెంకటేశం పెళ్లి తనే నిలబడి చేశాడు సావుకారు. పదేళ్లకిందట.

అట్లాంటి వెంకటేశం గృహప్రవేశ ఆహ్వానపత్రిక చేతిలో పెట్టినప్పుడు ఇంక

వెంకటేశ్వరరావు ఎంతోకాలం తనకొలువులో ఉండబోడని మొదట స్ఫురించింది సావుకారుకు. మరోసారి వెంకటేశ్వరరావును చూశాడు. వెంకటేశ్వర రావు ఇవేళ డ్రైవర్ దుస్తుల్లో లేడు. కొత్తగా ఉన్నాడు. నీలం తెలుపుగళ్ల చొక్కా, లేతనీలం పేంటూ వేసుకుని కొత్తగా కన్పించాడు. ఇట్లాంటి ఇంటిదుస్తుల్లో వెంకటేశంని చూడటం ఇదే తొలిసారి కావటంవల్ల — పంజరం నించి ఎగిరిపోయే పక్షిలాగా కన్పించాడు. తన చేతిలో పెట్టిన ఆహ్వానపత్రిక — సమానహోదాలో తనకు ఇచ్చినట్టు అన్పించింది.

వెంకటేశ్వర రావుకు ముందు చూపుంది.

'రేపూ ఎల్లుండీ సెలవు ఇప్పించాలండి' అన్నాడు వెంకటేశ్వర రావు.

సావుకారు మౌనంగా విన్నాడు.

ఇల్లు కట్టించుకుంటున్న రోజుల్లో సైతం సెలవు కావాలని అడగలేదు వెంకటేశ్వరరావు. బండిమీద పదిరోజులు పోతే పదిరోజులు ఇంటి దగ్గర విశ్రాంతి. అట్లాంటి సదుపాయంతో స్వంతపనులు చేసుకునేవాడు. ఆ రోజుల్లో సైతం ఏపని చెప్పినా అర్ధరాత్రి లేచిరమ్మన్నా వచ్చి పనిలో చేరే మనిషి.

సావుకారు మనసులో సుళ్లు తిరగడం మొదలయింది. అసహనం, ఈర్ష్య, ద్వేషం — అన్నీ కలిసి సుళ్లు సుళ్లుగా మనసును ఆవరించాయి. అయినా వెంకటేశ్వరరావు ముఖంచూస్తే చాలు — అవన్నీ ఎక్కడివక్కడ మాయమైపోతాయి.

'సామానంతా ఇల్లు మార్చాలండీ...'

ముప్పయి అయిదేళ్ల వెంకటేశ్వరరావు ఇప్పటికి ఫుట్‌బాల్ మైదానం నించి వచ్చిన ఆటగాడిలాగానే కన్పిస్తాడు. ఫుట్‌బాల్ ఆటలు జరిగే చోటుకు డ్యూటీ వేసుకుని వెళ్లడం అంటే ఇప్పటికీ వెంకటేశ్వరరావుకు ఆటలాగానే ఉంటుంది. అందుకే కలకత్తా అంటే ఇష్టం.

'సరేలే, మేనేజర్‌ని ఒకసారి రమ్మను' అని చెప్పి వెంకటేశ్వరరావును మరోసారి చూశాడు సావుకారు.

వెంటేశ్వరరావు సవినయంగా సెలవు తీసుకుని నమస్కరిస్తూ వెనక్కి అడుగువేసి అక్కణ్నించి వెళ్లిపోయాడు.

గేటుదాటే వరకు సావుకారు దృష్టి వెంకటేశ్వరరావు మీదే నిలచిపోయింది.

* * *

సావుకారు ఆ వేకుజాము రైల్లో రాయవెల్లూరు నుండి వచ్చాడు. తన జబ్బు సంగతేమిటో అక్కడ తేలిపోతుందని, అక్కడి డాక్టర్లు చాలా గొప్పవాళ్లని తనకు ఎందరో సలహా ఇచ్చారు. ఇద్దరు డాక్టర్లు తోడుగా వచ్చారు. మేనల్లుడు తనతో ఉండి

ప్రయాణం ఏర్పాట్లు చూశాడు. రకరకాల పరీక్షలు చేశారు. వారం దినాలు అక్కడే ఉన్నారు. డాక్టర్లు పరీక్షలను బట్టి — భారం అంతా భగవంతుడి మీద వదిలేశారు. ఇంటి దగ్గర చికిత్సకు మందులూ, ఇంజెక్షన్‌లూ, నిద్ర ఆహారనియమాలూ, వ్యాయామమూ, యోగాసనాలు ఇంకా అనేక జాగ్రత్తలు చెప్పారు. వాటన్నిటితో తిరిగివచ్చాడు సావుకారు. అక్కడ ఆ ఆస్పత్రిలో పరీక్షల కోసం ఉన్నప్పుడూ, తర్వాత ఆ ఆస్పత్రినుండి బైటపడినప్పుడూ అక్కడ మహాఘనత వహించిన వైద్యులు చెప్పిందేమిటంటే — అక్కడ ఏ చికిత్స చేసినా ప్రయోజనం ఏమీ ఉండదని — దాన్నిబట్టి సావుకారుకు బోధపడిందే మిటంటే — భగవంతుడునించి పిలుపుకోసం ఎదురుచూడటం ఒక్కటే అని.

ఇప్పుడు నలభైఅయిదేళ్లు నిండాయి. ఇంతకాలం బతకడమే గొప్ప. ఇట్లాంటి జబ్బులొచ్చినవాళ్లు ముప్పయ్యేళ్లకే ఆదారి పట్టేశారు. సావుకారు అద్రుష్టవంతుడే అని రాయవెల్లూరులో డాక్టర్లు ఎవరితోనో అంటుంటే అది సావుకారు చెవిలో పడింది.

బతకాలని ఉంది. బతకాలి. చావును తప్పించుకోవాలి... అనుకున్నాడు సావుకారు. బి.పి తగ్గి మామూలు కావటంలేదు. దానికితోడు మధుమేహం. కీళ్లనొప్పులు. పండ్లరసాలమీద, టానిక్కుల మీద బతకాల్సిందే ఇంక. కూర్చుంటే వెన్నునొప్పి. పడుకుంటే నడుంనొప్పి. నిద్ర ఉండదు.

వెంకటేశ్వరరావు వెళ్లిపోయిన తర్వాత మనసంతా రాయవెల్లూరు ఆస్పత్రి, వైద్యపరీక్షలూ, అక్కడ వైద్యులతో, ఆ ఆలోచనలతో నిండిపోయింది.

తన డాక్టర్లు మాత్రం 'ఆరోగ్యం క్రమంగా బాగుపడుతుంది లెండి' అని ధైర్యం చెప్తున్నారు. అలా చెప్పటం వాళ్ల వృత్తి. వాళ్లు బతకాలంటే ఆ మాటలే చెప్పాలి. ఏం భయంలేదు అనే చెప్పాలి. నిజం చెప్పకూడదు. అబద్ధమే చెప్పాలి. ఆ అబద్ధాలే వాళ్లు చెప్తున్నారు.

సావుకారు చిన్నకూతురు ఎనిమిదేళ్ల ధనలక్ష్మి వచ్చింది. సావుకారు తన ఆలోచనల్లో మునిగిపోయి తన దగ్గరకు వచ్చిన కూతుర్ని సైతం చూడలేదు.

'నాన్నా మొన్న ఆ ఫోటో తెచ్చిచ్చారు' అంది.

కూతురు మాటలు విన్పించలేదు సావుకారుకు. అనారోగ్యం — రోగం — వైద్యం — చికిత్స — మందులు — వైద్యులు — ఆయువు — చావు — స్మశానం — మంటలు — చితి — బూడిద — ఇంట్లో ఏడ్పులు — అట్లా మనసంతా చిక్కులు పడింది.

నాన్న తన మాట విన్పించుకోలేదని తెలిసికూడా 'ఫోటో తీసుకొస్తానా్నాన్నా' అని

ఆ అమ్మాయి లోపలికి వెళ్లిపోయింది.

గేటు చప్పుడు...

ఎవరో వస్తున్నారు...

అటు చూశాడు...

ఆయన్ని ఊర్లో వాళ్ల 'సాధువు గారు' అంటారు.

కన్పించటానికి ఆయన సాధువులా కన్పించడు. కాషాయాంబరాలు, కమండలం, జడల జుత్తూ, ఇవేమీ ఉండవు. నుదుట విభూతి కన్పించదు. పొడవుగా ఉంటాడు. తెల్లని ఉతికిన గుడ్డలు రెండే రెండు. నడుం నించి మోకాలు వరకు కట్టుకున్న పంచె. పైన భుజమ్మీద తెల్లని తువ్వాలు అంతే.

ఎవరి అనుమతీ తనకు అక్కర్లేదు అన్నట్టుగా మెట్లెక్కి గదిలోపలకి వచ్చి లోపలకూర్చున్న సావుకారుకు కనిపించేట్టు నుంచుని 'స్వామి ఈ పూట మన ఇంటికి భోజనానికి వస్తాను' అని కొంచెంసేపు సావుకారును చూస్తూ నుంచున్నాడు ఆ సాధువు.

వయసు ఎంత ఉంటుందో చెప్పటం కష్టం. అరవైయ్యేళ్లు దాటి ఉండవచ్చు అనిపిస్తుంది.

ఆ సాధువును చూశాడు సావుకారు. ఇదివరలో కూడా చూశాడు.

ఆయన చెప్పిన మాటలు విన్నాడు.

అయినా చూపు మళ్లించలేదు. అలాగే సాధువును దృష్టి కేంద్రీకరించి చూడ సాగాడు సావుకారు. అంత ధైర్యంగా తన ఎదురుకు వచ్చి భోజనానికి వస్తున్నాను అని చెప్పడం వింత అన్పించింది సావుకారుకి. బిచ్చమెత్తుకునే మనషులంటే సావుకారుకు కోపం. అలా వచ్చిన వాళ్లను పోపో అని తిట్టి తరిమేస్తాడు సావుకారు. అయితే ఇప్పుడు మాత్రం నోరుపెగల్లేదు. ఎంత ప్రయత్నించినా నోట మాట రావటం లేదు. మౌనంగా చూస్తూ ఉండిపోయాడు సావుకారు. తన గొంతు పెగలకపోవడం విచిత్రం అన్పించింది సావుకారుకు.

'సరిగ్గా పన్నెండు గంటలకు వస్తాను స్వామీ' అని ఆ సాధువు అక్కణ్నించి కదిలిపోయాడు.

సాధువు గొంతు ఎప్పుడో, ఎక్కడో విన్నట్టుంది. లారీడ్రైవర్ బతుకులో కొన్నివేల మందితో పరిచయం. వాళ్లల్లో కొన్ని వందలమంది తనకు స్నేహితులు, వాళ్లల్లో ఎవరో ఈ సాధువుగా వచ్చారేమో...

గేటుదాటి సాధువు వెళ్లిపోయిన తర్వాత గొంతు పెగిలింది.

సాధువు తన మీద మంత్ర ప్రయోగం చేశాడా? ఎందుకు నోటమాట రాలేదు? ఆశ్చర్యంగా ఉంది. ఆ సాధువు వచ్చి భోజనానికి ఇంటికి వస్తున్నట్టు చెప్పడం వింతగా ఉంది. చిత్రంగా ఉంది. ఆ సాధువు తనను ఆదేశిస్తున్నట్టుగా చూశాడు. అతడి అభ్యర్థనని తిరస్కరించలేకపోయాడు. పోపొమ్మనలేక పోయాడు. ఇదే తొలిసారి. మనసు ప్రశాంతంగా ఉంది. తనకు తెలీకుండానే అంతా జరిగిపోయినట్టు ఉంది.

* * *

సావుకారు పెద్దమ్మాయి వరలక్ష్మి ఉదయం ఫోటోగ్రాఫర్ తెచ్చి ఇచ్చిన ఫ్రేమ్ కట్టించిన ఫోటో పట్టుకుని వచ్చింది. రెండడుగుల పెద్దఫ్రేమ్. ఆ ఫోటోలో సావుకారు పాతికేళ్ల వాడు. అప్పుడు లారీడ్రైవరుగా ఉండేవాడు. ఆ లారీడ్రైవర్ దుస్తుల్లోనే ఉంది ఆ ఫోటో. ముఖచిత్రం మాత్రమే. కాని లారీడ్రైవర్ యూనిఫార్మ్ తెలుస్తున్నది. మనిషి చాల అందంగానూ, ఆరోగ్యంగానూ ఉన్నాడు. ఆనాటి శరీరం అంటే సావుకారుకు ఇష్టం. కాని ఆనాటి ఆ యూనిఫార్మ్ ఇష్టంలేదు. అప్పుడు రాళ్లు తిన్నా అరిగిపోయేవి. కడుపునిండా ఆకలి ఉండేది. ఆకలి ఎంత మహాభాగ్యం అన్పిస్తున్నది ఇప్పుడు. తినడానికి దొరికేది కాదప్పుడు. తినే వస్తువు ఏది దొరికినా ఇంట్లో భార్యా, పిల్లలూ, తల్లీ తండ్రీ గుర్తొచ్చి ఏవీ తినాలనిపించేది కాదు. ఇంటికి తీసుకువెళ్లి అందరితో పాటు తినేవాడు. ఒళ్లు మంచిసౌష్ఠవంగా ఉండేది. ముక్కుచీది ఎరగడారోజుల్లో. తలనొప్పి అంటే ఏమిటో తెలిసేది కాదు. అసలు శరీరం ఉందో లేదో కూడా తెలిసేదికాదు. అట్లాంటిదీ ఈనాడు ప్రతి నరమూ, ప్రతి కండరమూ, ప్రతి కీలూ, ప్రతి ఎముకా దానికదే ఊడిపోతున్నట్టు బాధ. నొప్పి. నీటిలో పడిన శవం ఉబ్బిపోయినట్టుగా రెండువందల పౌనుల బరువు శరీరం ఇప్పుడు.

'నాన్నా ఈ ఫోటో ఇక్కడ ఈ హాల్లో పెట్టిస్తాన్నాన్నా' అంటున్నది వరలక్ష్మి...

పదిహేనేళ్ల కిందట — పంతొమ్మిది వందల ఏభైలో ఫోటో తీయించు కోవటానికి స్టుడియోకి వెళ్లాడు. లారీ నడుపుకుని కొండల్లో, అడవుల్లో, పొలాల్లో, నదిగట్ల మీద ప్రయాణం చేయడం అంటే సరదాగా ఉండేది. ఆ పట్టణంలోని యజమానిని వాళ్ల లారీడ్రైవర్ సాంబడు హత్యచేసి చంపేశాడట. అప్పుడు ఆ స్టూడియోలో ఉన్న వాళ్లల్లో అలాంటి కర్కోటకపు దొంగ లంజకొడుకులకు అంతే కావాల్లెండి' అని ఒకాయన అన్నాడు. అక్కడున్న వాళ్లంతా ఆ హత్యకు గురయిన యజమానిని తిట్టారు. వాళ్లల్లో ఎవరికీ జాలి అన్నా కలగలేదు. వీధుల్లో తిరుగుతున్న విషపు పామును చంపేస్తే 'మంచి పన్చేశారు' అని మెచ్చుకుంటున్నట్టు ఉంది వాళ్ల ధోరణి. ఆ ఫోటో చూసినప్పుడు ఈ స్మృతి మెరిసింది. శరీరమంతా అర నిమిషంలో

కంపించిపోయింది. కార్డు సైజులో బ్లాక్ ఎండ్ వైట్‌లో లారీడ్రైవర్ దుస్తులలో యువకుడిగా ఉన్న సావుకారు ఫోటో ఈ మధ్యనే తాత గారింట్లో దొరికితే వరలక్ష్మి ఆ ఫోటోని ఒక పెన్నిధి దొరికినంత సంతోషంతో ఇంటికి తెచ్చింది. స్టూడియో ఫోటోగ్రాఫర్‌ని రప్పించి — వాడి సలహా మేరకు రీకాపి చేయించి ఈ ఎన్‌లార్జ్‌మెంట్ చేయించి బరంపురంలో ఆ ఫోటోకు చాల అందమైన ఫ్రేమ్ కట్టించింది. ఫోటో స్టూడియో ఆయనే ఇవన్నీ చేసి ఉదయం తెచ్చి ఇంట్లో ఇచ్చాడు. ఆ ఫోటో ఇంట్లో వాళ్లందరికీ ఆటబొమ్మ. ఉదయంనించి ఆ ఫోటో ఎక్కడ పెడితే ఇంట్లో అందంగా ఉంటుందో చర్చించుకుంటున్నారు.

'బాగా వచ్చింది కద నాన్నా' అని తండ్రి కళ్లముందు చాలాసేపు పెట్టి చూపించింది. సావుకారుకు నచ్చింది. కాని ఆ ఫోటోలో ఉన్న మనిషి తనేనా అనే సందేహం కూడా వచ్చింది. వాడు లారీడ్రైవరు. తాను సావుకారు. వాడువేరు. తనువేరు. వాడువేరు... వాడువేరు...

వాడువేరు... తను చెట్టు...

అందుకే రూపంలో అంత భేదం. మట్టిలోపల... మట్టి పై భాగాన వేరూ.. చెట్టూ...

సావుకారు సంతానంలో చిన్నవాడు వంశోద్ధారకుడు పుత్రరత్నం ఆరేళ్ల బాబు వచ్చి "ఈ ఫోటోలో ఈ డ్రైవర్ ఎవరు నాన్నా?' అని తండ్రి చేయి పట్టుకుని, ముఖాన్ని మరో చేత్తో తనవేపు తిప్పి అడిగాడు.

'పెద్దక్క నీవే అంటున్నది.' అని తండ్రి జవాబు కోసం ఆగాడు.

సావుకారు నోటినించి ఏ జవాబూ రాలేదు.

'మన డ్రైవర్ వెంకటేశం కదనాన్నా' అని తనే సమాధానం చెప్పాడు.

'చూడు పెద్దక్క... నాన్నే అని చెప్తున్నాది' అని కూడా అన్నాడు వాడు.

వరలక్ష్మి వాడి పిచ్చి సందేహాలకు నవ్వి, వాడిని తీసుకుని, ఆ పోటోను మరోచేత్తో పట్టుకుని వెళ్లిపోయింది.

కొడుకు వేసిన ప్రశ్నతో సావుకారుకు సిగ్గయింది.

కొడుకు నిజమే చెప్పినట్టు కూడా అన్పించింది సావుకారుకు.

ఆ ఫోటో తనదా కాదా అన్న సందేహం కూడా కల్గింది సావుకారుకు.

***

మేనేజర్ వచ్చి 'నమస్కారం సార్, మీరు మొన్నటికే వచ్చేస్తారని ఆ రోజూ స్టేషనుకి వచ్చాము సార్. మన ఎమ్.ఎల్.ఏ గారు మీరు వస్తారని తెలిసి ఆ రోజు

మీ కోసమని తన ప్రయాణం వాయిదా వేసుకున్నారు సార్' అని చెప్పి సావుకారు ముఖంలోకి చూసి, ఆయన వినటం లేదని గ్రహించి, ఈ సారి, ఎదురుగా వచ్చి కూర్చుని మేనేజర్ మళ్లీ అదే చెబుతున్నాడు. మేనేజర్ అంటే సావుకారుకు చాలా నమ్మకం. అతడి చేతిలో బంగారం పెట్టి మరచిపోయినా, గుర్తుచేసి తిరిగి ఇచ్చేరకం. తనకు రెండు కళ్లులాంటి వాడు. అలాంటి మనిషి దొరకటం తనకు దైవప్రసాదమే.

సావుకారుకు ఊర్లో గౌరవం ఉంది. ఒక రాజకీయ పార్టీలో సభ్యత్వంతో పాటు జిల్లాస్థాయిలో పదవులున్నాయి. ఊర్లో ప్రజా సంస్థలన్నింటా అతడి మనుషులు అధికార పదవుల్లో ఉన్నారు. బంధువర్గానికి అతడే పెద్ద దిక్కు. తల్లి దండ్రులూ, భార్యాపిల్లలూ, మూడంతస్తుల నివాస భవనం, విలాసాలకు సరితూగే కార్లూ, బస్సుల యాజమాన్యం, వైన్ షాపులూ, ఇంకా అనేక వ్యాపారాలూ, చిట్‌ఫండ్ కంపెనీ — పట్టిందంతా బంగారమయిన ఐశ్వర్యం ఉంది. అన్నీ ఉన్నాయి. కాని ఆరోగ్యం లేదు. మహా భాగ్యమైన ఆరోగ్యం లేదు. అది తెలుసుకున్నప్పటి నించీ ప్రాణభయం పట్టుకుంది.

అందుచేతనే సావుకారు మేనేజర్ చెపుతున్న విషయాలు చెవిపెట్టి వినటం లేదు. మనసు వేరే ఆలోచనల్లో నిండా మునిగిపోయి ఉంది.

కొంతసేపటికి —

'లాయర్ గారు కోర్టుకు వెళ్లారా?' అన్నాడు. పొరుగు రాష్ట్రం నించి అక్రమ రవాణకు సంబంధించి రెండు లారీలు నిఘా అధికార్లు పట్టుకున్నారు. ముందు వాటిని విడిపించాలి... కోర్టులో ఇవేళ ఆ వ్యవహారం తనకు అనుకూలంగా పరిష్కారం కావాలి. ఆ తీర్పుకోసం చూస్తున్నాడు.

'వెళ్లారండి, వాయిదా కోరి —'

'అదికాదు —' సావుకారు.

'రాత్రే అది పరిష్కారమైపోయిందండి... మన ఎమ్మెల్యే గారు మాటాడి...'

ఇదే మేనేజర్ గొప్పతనం. తను సమయానికి ఊళ్లో లేకపోయినా చొరవ తీసుకుని వ్యవహారాలు నడిపించగలడు. సమయస్ఫూర్తి పుష్కలంగా ఉన్నవాడు. అన్నిటికన్నా ముఖ్యం విశ్వాస పాత్రుడు. అదీ సావుకారు ధైర్యం. సావుకారు సంతోషించాడు.

'హైదరాబాద్?'

రాష్ట్ర రాజధానిలో ఆఫీస్, గెస్ట్‌హౌస్, వాణిజ్యం, కోర్టులు, బ్యాంకులూ, ప్రభుత్వ కార్యాలయాలూ, డాక్టర్లూ — ఆ కార్యకలాపాల సమీక్ష విన్నాడు సావుకారు. మనసు

కుదుటపడింది.

విజయ సోపానాలు ఎన్ని అధిరోహించినా ఆపై సోపానం దగ్గర ఇప్పుడు సావుకారుకు కన్పిస్తున్నది చితిమంట. మృత్యువు విశ్వరూపమే "అంతే కావాల్లెండి. అలాంటి కర్కోటకపు — "

అవును. తన ఉద్యోగులు ఎవరూ తనను కర్కోటకపు ముండా కొడుకు అనకూడదు. అందరూ తనను ప్రేమిస్తారు. గౌరవిస్తారు. అభిమానిస్తారు. కర్కోటకపు ముండా కొడుకు తను కాలేదు కాబట్టీ. అది తన అభిప్రాయం. తన గురించిన తన అభిప్రాయం. తన గట్టి అభిప్రాయం!

అట్లా ఉన్నాడు కాబట్టే తనకు అన్నీ కలిసొచ్చాయి. దాన్ని అదృష్టమే అంటారో, పూర్వజన్మ సుకృతమే అంటారో, దైవ ప్రసాదమే అంటారో — తనకు తెలీదు.

ఇంక ఎన్నాళ్లో ఉండదు ఈ హింస. ఈ లోపల ఏం చెయ్యాలో తోచదు.

అట్లాంటి ఆలోచనల్లో ఉండగా చిన్న కూతురు పండ్లరసం గ్లాసు తెచ్చి నుంచుంది. మళ్లీ అప్పుడు గుర్తొచ్చింది సాధువు భోజనానికి వస్తారన్న సంగతి.

భార్యతో చెప్పి రావాలని లేచి వెళ్లాడు సావుకారు. శరీరం బరువుగా ఉంది. మనసు మరింత బరువుగా ఉంది.

గోడ గడియారం తీయించేసి ఆ చోటులో నాన్న ఫోటో పెట్టించింది వరలక్ష్మి. బైటివాళ్లకు కూడా కన్పించేట్టుగా ఉంది అక్కడ. ఆ ఫోటోలో నాన్న చాలా బావున్నాడు. చేవ తీరిన శరీరంతో నిగనిగలాడుతున్నాడు. చల్లని చూపులతో, నవ్వు ముఖంతో, యవ్వన రూపంతో, పొట్టి క్రాఫ్‌తో చురుగ్గా, ఉత్సాహంగా ఉన్నాడు నాన్న. ఇప్పటి నాన్నకీ అప్పటి నాన్నకీ మధ్య ఎక్కడా పోలికల్లేవు. వాళ్లిద్దరూ వేరు వేరు మనుషులు. అందుకే తమ్ముడు పోల్చుకోలేకపోయాడు.

ఆ ఫోటో నచ్చింది. కాని చనిపోయిన వాళ్ల ఫోటోలు సాధారణంగా అట్లా పెడ్తారు. అందువల్ల ఆ ఫోటో అక్కడ పెట్టటం నచ్చలేదు.

మళ్లీ ఆ పాతరోజులు ఇష్టం. ఫుట్‌బాల్ మైదానంలో జట్టులో ఎవరూ రాకపోయినా సరే ఆడుకునేవాడు. ఆ బంతి ఉంటే చాలు. ప్రపంచంలో ఇంకేమి వద్దు. ఆ బంతీ, మైదానమూ, జట్టులోని ఇతర ఆటగాళ్లు — కడుపునిండా ఆకలి. ఆ ఆకలి కావాలిప్పుడు. ఆకలి ఎంత గొప్పవరమో కదా అన్పిస్తున్న దిప్పుడు.

అప్పటికింకా తనకు పెళ్లికాలేదు. చేతిలో పైసా ఉండేదికాదు. అయినా సరే సంతోషంగా ఉండేది. ప్రపంచం అంతా — విశాలంగా ఫుట్‌బాల్ మైదానంలాగా ఉండేది. మనుషులంతా తనతో మైదానంలో ఆడుకునే జట్టుగాళ్లలా ఉండేవాళ్లు.

కొత్తరోడ్ల మీద దూరప్రాంతాలకు పోయినప్పుడు కూడా — తన ఊళ్లో ఇంటి దారుల్లాగ చిరపరిచితంగా ఉండేవి. ప్రతి చోట అమ్మలాంటి మనుషులు నాన్నలాంటి మనుషులు దొరికేవాళ్లు. ఆ దారుల్లో పోతే ఆ ఊళ్లల్లో మజిలీ వేసుకుని వాళ్లు పెట్టిన రొట్టెతిని వెళ్లేవాడు. వాళ్లతో చెరగని అనుబంధాలు కుదిరేవి. అట్లాంటి అనుబంధాలతోనే సీతాలక్ష్మి దొరికింది. తనకు పెళ్లయింది. కట్నాలూ, కానుకలూ లేకపోయినా సిరి ఇంట్లో అడుగు పెట్టింది. మైదానం ఇంట్లోకి వచ్చినట్టు ఉండేది. తనే ఒక బంతి. ప్రపంచం తనను బంతిని చేసి ఆడుకుంటున్నట్టు అన్పించేది. దేశం నలుమూలలకీ లారీల రాకపోకల్లో జీవితం ఎంతో అందంగా ఉండేది బతుకు. అడవుల్లోంచి, కొండల మధ్యలోంచి, నదీ ప్రవాహాల వొడ్డుల్లోంచి, పంట పొలాల్లోంచి — వర్షాల్లో, ఎండల్లో, చలిలో, చీకట్లలో — సాహసంగా ఉండేది. తనను తనే యోధుడిగా భావించుకునే వాడు. సమస్యలూ బాధలూ దుఃఖాలూ కష్టాలూ సైతం మధురంగానే ఉండేవి.

ఇప్పుడా మాధుర్యం లేదు. ఇప్పుడా మాధుర్యం రాదు కదా.

* * *

సాధువు ముందు చెప్పినట్టు సరిగ్గా పన్నెండు గంటలకు వచ్చాడు. ఆ సాధువు రోజుకు ఒక్కసారే భోజనం చేస్తారంట. సాధువుకు భోజనం పెట్టడం సీతాలక్ష్మికి సంతోషంగా ఉంది. ఆ రోజు ఆమెకి తన కన్నవారింట్లో ఉన్నట్టు అన్పించింది. ఎప్పుడూ తమ ఇల్లు స్నేహితులతో, బంధువులతో కళకళలాడేది. వచ్చే పోయే ఇల్లు. సందడి సందడిగా ఉండేది. ఈ రోజు వంటంతా తనే స్వయంగా చేసింది. అందువల్ల కూడా ఆమెకు ఎంతో సంతోషంగా ఉంది.

సాధువును చూసినప్పుడు ఆమెకు తనకు ఆ ముఖం ఎంతో పరిచయం అన్పించింది. దంపతులు ఇద్దరూ వారి దగ్గర కూర్చుని ప్రేమతో వడ్డించింది. చిన్నపిల్లవాడిని చూసినట్టుగా ఉంది. పప్పూ, పప్పు పులుసూ, పచ్చళ్లు రెండూ, కూరలు నాలుగూ, చారూ, ఆవకాయ, పెరుగూ, పాయసం — ఇన్ని చేసింది. స్వయంగా. అయినా సాధువు — సరిగ్గా తిననేలేదు. మూడే మూడు ముద్దలు తిన్నారు. పప్పుతో, కూరతో, పెరుగుతో. అయిపోయిందని లేచిపోయి చేయికడుగు కున్నాడు.

'అన్నపూర్ణ మీ ఇంట్లో సదా వర్ధిల్లు గాక' అని దీవించాడు సాధువు.

భార్య, కూతుళ్లు చాలా చాలా సంతోషించారు. వాళ్ల సంతోషం తనకు ఆనందం అన్పించింది.

వెళ్లిపోతూ సాధువు —

'మీ ఆరోగ్యం త్వరలోనే బాగుపడుతుంది' అన్నాడు.

ఇట్లాంటి మాట వినాలని కొన్ని ఏళ్లుగా ఎదురు చూస్తున్నాడు సావుకారు. ఇవేళ ఏదో వరంలాగ ఆ మాట విన్పించింది. అమ్మా అని పిలిస్తే తల్లికి బిడ్డ అనురాగం అర్థమౌతుంది. ఆ రకంగా అర్థమయింది సాధువు ఆశీస్సు.

సాధువు దూరమయిపోయిన కొద్దీ తన ఒంటరి తనం, భరించలేని తన శరీరం బరువూ మళ్లీ తెలియసాగాయి. సాధువు సమక్షంలో తాను ఉన్నంత సేపు తనకు శరీరం ఉన్నట్టే తెలీలేదు.

'మీ ఆరోగ్యం త్వరలోనే బాగుపడుతుంది.'

ఆ చల్లని మాటకోసం ఎంతమంది డాక్టర్ల చుట్టూ తిరిగాడు!

* * *

ఊళ్లో ఉన్నప్పుడు తప్పనిసరిగా రోజూ సావుకారు ఊరుకు దగ్గర్లోనే ఉన్న తోటకు వెళ్లి అక్కడ సాయంత్రం గడిపి రావటం అలవాటు. అట్లా తోటనించి తిరిగి ఇంటికి వస్తుండగా ఒకరోజు చెరువు గట్టు మీద పాడుపడిన గుడి దగ్గర సాధువు కన్పించారు. కారు ఆగలేదు. ఆపుమందామనుకునే సరికల్లా చెరువు గట్టు దాటిపోయింది కారు. సాధువును ఆగి చూసి రావాల్సిందని మనసు పదే పదే చెప్పసాగింది. సాధువుకు తానేమి ఇవ్వలేదని గుర్తొచ్చింది. కొత్త బట్టలు పెట్టాల్సింది. పండ్లు ఇవ్వాల్సింది. పాదాలకు నమస్కరించాల్సింది... అన్పించసాగింది.

నెలదినాలు గడిచాయి. తోటనించి వచ్చిన ప్రతిసారీ చెరువు గట్టుమీది పాడుపడిన దేవాలయం దగ్గర ఉంటున్న సాధువును కలుసుకుని, వారితో మాటాడి రావాలని అనుకుంటూనే ఉన్నాడు. కొన్ని రోజులు సాధువు కన్పించలేదు. కారు దేవాలయం దగ్గర ఆపి, దిగి చూస్తే — సాధువు లేరక్కడ. ఎక్కడున్నదీ చెప్పేవాళ్లుకూడా ఎవరూ లేరక్కడ. కొన్నిసార్లు ఆ గట్టుదాటే సమయంలో ఆ సంగతే మరచిపోయే వాడు. మరి కొన్ని సార్లు ఇవేళ వద్దు. మరో రోజు తీరిగ్గా వారితో చాలసేపు గడిపేట్టుగా ఉండాలి. మరికొన్ని సార్లు ఇట్లా అలసి పోయి కాదు. చెమట శరీరంతో కాదు. స్నానం చేసి, ఉతికిన దుస్తులతో రావాలి. కొన్నిసార్లు పండ్లేమన్నా తీసుకుని రావాలి. వుత్తచేతుల్తో పోవద్దు. ఇట్లా తనలో తనకే సంఘర్షణ. సాధువును చూడాలని మనసు ప్రార్థించ సాగింది. కొన్నిసార్లు తనతో వేరే కొత్త మనుషులు ఉండేవాళ్లు.

మధ్యలో వెంకటేశ్వరరావు ఉద్యోగం మానేశాడు. తన స్వంత బ్రోకారాఫీస్

పెట్టుకున్నాడు. దాని ప్రారంభోత్సవం సావుకారు చేతిమీదిగానే జరిగింది. ఆ రోజుల్లోనే దాదాపు ఏభైమంది పాత ఉద్యోగుల్ని తీసేశాడు సావుకారు. కోర్టుల్లో నాలుగు కేసులు ఓడిపోయాడు. పెద్దకేసులు రెండు గెలిచాడు. ఒక లారీ డ్రైవర్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఇద్దరు డ్రైవర్లు పోలీస్‌స్టేషన్‌లలో దెబ్బలు తిన్నారు. మేజస్ట్రేట్ బదిలీ అయిన సందర్భంగా క్లబ్ వాళ్లు ఏర్పాటు చేసిన విందు ఖర్చుకు తనే విరాళం ఇచ్చాడు. తన కుటుంబ వైద్యుడు — వారం దినాలు ఊళ్లో లేకపోతే ఇంజక్షన్ మందులు తీసుకోవటం మానేశాడు. తర్వాత తాగే టానిక్కులూ, మింగే మందుబిళ్లలూ — విసర్జించాడు. అయినా ఆరోగ్యం కొత్తగా చెడిపోలేదు. మామూలుగానే ఉంది. సాధువు మాట 'మీ ఆరోగ్యం త్వరలోనే బాగుపడుతుంది' మనసు నిండా ఆవరించుకుని ధైర్యం కలిగించసాగింది.

ఆ రాత్రి పెద్దవాన పడింది. మంచినిద్ర పట్టింది. వాన గాలులకు చలిపెట్టి మెలుకువ వచ్చింది. ఆ మెలుకువ తర్వాత నిద్ర పట్టలేదు. సాధువును చూడాలని మనసు హోరు పెట్టసాగింది. అప్పుడే ఆ వర్షంలోనే ఇంటినించి నడుచుకుంటూ చెరువు గట్టు మందిరం వరకు పోవాలనిపించింది. సాధువు మళ్లీ రాకూడదా? భోజనానికి ఈ పూట వస్తానని చెప్పకూడదా? వచ్చి కనిపించకూడదా? అని మనస్సు ఊహించ సాగింది. ఆరోజు తన ఇంటికి భోజనానికి వస్తానన్నప్పుడు — సాధువు తననేమీ అడగలేదు. తనకు ఈ ప్రపంచంలో కావాల్సింది ఏదీ లేదన్నట్టుగా కన్పించారాయన.

తర్వాత నిద్ర పట్టలేదు. అన్నీ ఆలోచనలే. భయాలే. సందేహాలే. అనుమానాలే. ప్రశ్నలే. ఆ చీకటి, ఆ నిశ్శబ్దము, ఆ చైతన్య రహితమైన ప్రకృతి— అన్నీ భయంతో ఊపిరి బిగపట్టి రాపడినట్టున్నాయి.

వేకువ జామున నిద్రపట్టి — లేచేసరికి వర్షం పడుతూనే ఉంది.

పిల్లలు పరీక్షల కోసం చదువుకుంటున్నారు.

మేడ మూడో అంతస్తు నించి చూస్తే ఊరంతా కన్పిస్తుంది. తన బంగళా ఊరు ఉత్తర చివరగా ఉంది. దగ్గర్లోనే చెరువు. ఆ చెరువుగట్టు మీదనే పాడుపడిన దేవాలయం. పైకి వెళ్లి చూడాలనిపించింది. సాధువు కన్పిస్తారేమో. తప్పని సరిగా ఇవేళ వెళ్లి చూడాలి. ఆయన దగ్గర చాలాసేపు ఏడవాలని పించింది. చాలాసేపు కూర్చోవాలి అనిపించింది.

చిన్నగా వాన కురుస్తూనే ఉంది. జనం నీళ్లకోసం బిందెలతో చెరువు వేపు పోయేవాళ్లూ, అట్నించి వచ్చే వాళ్లూ కన్పిస్తున్నారు. చెరువు నాలుగు వేపులా

నాలుగురేవులు. తూర్పుగట్టు రేవు పెద్దది. ఆ గట్టున పెద్ద రావిచెట్టు. ఆ చెట్టుకు సమీపంలో ఉన్న దేవాలయం దగ్గరే సాధువు ఉండేది.

సావుకారు మెల్లగా పైకి, పై అంతస్థుకి చేరుకున్నాడు.

ముందుగా పొరుగింటాయన తన పెరట్లోని తోటలో కన్పించాడు. తన కన్నా వయసులో బాగా పెద్దవాడు. పదవి నించి రిటైర్ అయికూడా పదేళ్లు గడిచే ఉంటాయి. చిన్న అందమైన పెంకుటిల్లు. ఆ చిన్నవానలో తడుస్తున్నాడు. కొత్తగా ఏవో పూలమొక్కలు నాటుతున్నట్టున్నాడు. రోజూ మొక్కలకు నీళ్లు పోస్తూ కన్పిస్తాడు. పావురాలు పెంచుతున్నాడు. వాటికి గింజలు చల్లటం, వాటితో ఆడుకోవటం, తోటపని చేసుకోవటం, రోజూ తను చూస్తున్న దృశ్యాలే. కాని ఈ రోజు అవి తన మనసులోని దృశ్యాలు — పరంపరగా కదులుతున్నాయి. తేనెటీగలు పెంపకం ఆయన హాబీ. రంగు రంగుల పువ్వులతో, ఆకు పచ్చని పూల మొక్కలతో తోట కళకళ లాడుతున్నది. రోజూ చూస్తున్నదే, కాని ఎప్పుడూ ఎప్పుడూ కన్పించలేదు. ఇంకా దూరంగా తూర్పు క్షితిజం వైపు ఉషోదయ కాంతులతో అరుణారుణ సూర్యబింబం కన్పించింది. అదే తొలిసారి సూర్యభగవానుని చూడటం. జీవితంలో రోజూ సూర్యుడు ఉదయిస్తాడని అప్పుడు తెలిసింది. అలాగే సావుకారు చాలసేపు నిలుచుండిపోయాడు. ఆ దృశ్యాలు మనసుమీద ముద్రలు మల్లే అతుక్కున్నాయి. తన జీవితంలో ఈ అందాలేవీ ఇంతకుముందు చూసినట్టు గుర్తులేదు. పువ్వులన్నీ రంగురంగుల అలంకారలతో వాసనలని వెదజల్లుతూ కన్పించాయి. అక్షణానే పిట్టల అరపుల్లోని కమ్మదనం వినిపించింది. ఆ సమయానే తన కళ్లకి చూపు వచ్చి నట్టయింది.

మెల్లగా మెడ మెట్లన్నీ దిగి హాలులోకి వెళ్లేసరికి ఎదురుగా సాధువుగారు. వారి చూపులో అనురాగముంది. తోటి జనుల మీద ఆర్ద్రతా భావం ఉంది. హృదయంలో ఔదార్యం ఉంది. నిరాడంబరత ఉంది. నిర్మలమైన మనస్సు ఉంది. మాటలో మనోహర మాధుర్యం ఉంది. ఆ ముఖంలో తేజస్సు ఉంది. దీక్షాభావం ఉంది. త్యాగబుద్ధి ఉంది.

బ్రతుక్కి అర్థం ఉంది.

✶ ✶ ✶

– 'స్రవంతి' సాహితీ మాసపత్రిక